సాక్షి
వికారాబాద్
బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025



నానో యూరియాతో..
నానో యూరియా వినియోగంతో అధిక దిగుబడులు సాధించొచ్చని డీఏఓ రాజారత్నం సూచించారు. 8లో▸



‘ఉపాధి’లో అవకతవకలు
ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. సామాజిక తనిఖీల్లో ఈ విషయాలు వెలుగుచూశాయి. 8లో▸



పత్తి తెగుళ్లతో భద్రం!
భారీ వర్షాల వల్ల పత్తి పంటకు రకరకాల పురుగులు సోకొచ్చు. తెల్ల, పచ్చ దోమలు ఆశించి ఆకులను నాశనం చేస్తాయి. 9లో▸

న్యూస్‌రీల్

సెలవుపై కలెక్టర్

రంగారెడ్డి కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు

అనంతగిరి: వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ 15 రోజుల పాటు సెలవుపై వెళ్లారు. కాగా ఈ పదిహేను రోజుల పాటు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి అప్పగించారు.

9,10వ తేదీల్లో సివిల్ సర్వీసెస్ సెలక్షన్ పోటీలు

6వ తేదీ వరకు పేర్ల నమోదుకు అవకాశం

అనంతగిరి: హైదరాబాద్‌లో ఈ నెల 9, 10వ తేదీల్లో రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ సెలక్షన్ 2025–26 పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడలాధికారి ఎంఏ సత్తార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు ఆసక్తి ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు జిల్లా క్రీడలాధికారి కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, షటిల్–బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్‌టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్, యోగా, ఖో ఖో పోటీలు ఉన్నాయని చెప్పారు. ఇందుకు రాష్ట్ర ఉద్యోగులు సర్వీస్ సర్టిఫికెట్ లేదా ఐడెంటిటీ కార్డును జతపరచాలన్నారు.

నేడు హకీంపేట్‌కు కార్మిక శాఖ మంత్రి

దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేట్ గ్రామానికి బుధవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హకీంపేట్‌లో నూతనంగా నిర్మిస్తున్న (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్) అధునాతన సాంకేతిక కేంద్రం నిర్మాణానికి, కోస్గి–తుంకిమెట్ల పీడబ్ల్యూ రోడ్డు నుంచి దుద్యాల్ డబుల్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ, గౌరారంలో మోడల్ అంగన్వాడీ భవనాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

కొడంగల్ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ శ్యామ్‌ధన్‌దాస్‌ను సన్మానిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్

కొడంగల్ రూరల్: కొడంగల్ తహసీల్దార్‌గా దీపక్‌శ్యామ్‌ధన్‌దాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.

దుద్యాల్ డిప్యూటీ తహసీల్దార్‌గా శివకుమార్



దుద్యాల్: దుద్యాల్ డిప్యూటీ తహసీల్దార్‌గా శివకుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న వీరేశ్ బాబు పూడూరు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లా కొందుర్గు ఆర్ఐగా విధులు నిర్వర్తిస్తున్న శివకుమార్‌కు ప్రభుత్వం ప్రమోషన్ కల్పించి దుద్యాల్ డిప్యూటీ తహసీల్దార్‌గా నియమించింది. విధి నిర్వహణలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తానన్నారు.

దూర విద్యతో ఉజ్వల భవిష్యత్తు

ఇబ్రహీంపట్నం: దూర విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ధర్మానాయక్ అన్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని దూరవిద్య స్టడీ సెంటర్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కౌన్సిలర్ల సమావేశంలో మాట్లాడారు. రెగ్యులర్ వర్సిటీలతో సమానంగా సార్వత్రిక విశ్వవిద్యాలయంలో కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, జర్నలిజం, లైబ్రరీ సైన్స్, ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంబీఏ తదితర కోర్సులు అందిస్తున్నట్లు వివరించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి డిగ్రీలో బీబీఏ కోర్సును ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. మిగతా వర్సిటీలతో పోల్చుకుంటే అంబేడ్కర్ యూనివర్సిటీలో ఫీజులు చాలా తక్కువగా ఉన్నట్లు చెప్పారు. రెగ్యులర్ డిగ్రీలు చేయలేనివారు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు, వ్యాపారస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దూరవిద్య డిగ్రీకి రెగ్యులర్ డిగ్రీతో సమానమైన విలువ ఉంటుందన్నారు.

వరిపై గురి!

లక్ష ఎకరాలకు చేరువలో పంటసాగు
- సాధారణ సాగు విస్తీర్ణం 93 వేల ఎకరాలు
- ఈ ఏడాది ఇప్పటికే 98 వేల ఎకరాలు
- సమృద్ధిగా నీరుండడంతో కొనసాగుతున్న వరినాట్లు



దోమ మండలంలో వరి నాట్లు వేస్తున్న రైతులు

వికారాబాద్: ఈ ఏడాది వరిసాగు విస్తీర్ణం అంచనాలను మించింది. నెల క్రితం వరకు లోటు వర్షపాతమే ఉండటంతో సాగు విస్తీర్ణం 80 వేలు దాటదని భావించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీటి మట్టం పెరగడంతో పాటు 98 వేల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగింది. ఆగస్టు మొదటి వారం వరకు వర్షాలు సంవృద్ధిగా కురియక చెరువుల్లో నీరు చేరలేదు. నెల రోజులుగా కురుస్తున్న వానల కారణంగా సాధారణ వర్షపాతాన్ని మించి నమోదవడంతో అదే స్థాయిలో వరి నాట్లు ఊపందుకున్నాయి. ఈ నెల రెండవ వారం వరకు ఈ పనులు కొనసాగే అవకాశం ఉంది. జిల్లా పరిగి, కొడంగల్ నియోజకవర్గాలతో పాటు వికారాబాద్ పరిధిలోని ధారూరు, కోట్‌పల్లి, తాండూరు పరిధిలోని యాలాల, తాండూరు, బషీరాబాద్ మండలాల్లో వరి అత్యధికంగా సాగు చేస్తారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 93 వేల ఎకరాలు. గతేడాదితో పాటు ఈ ఏడాది సైతం చెరువులన్నీ అలుగులు పారాయి.

జిల్లాలో ఇప్పటి వరకు 98,000 ఎకరాల్లో సాగు..

జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 93 వేల ఎకరాలు కాగా ఈ ఏడాది ఇప్పటికే 98 వేల ఎకరాల్లో వరి సాగు పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 20 మండలాలు ఉండగా ఇందులో 12 మండలాల్లో వేయి నుంచి 5 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ప్రస్తుతం వరినాట్లు కొనసాగుతుండటంతో విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది.

నిండుకుండలా చెరువులు

అధిక వర్షాలు వరి సాగు చేపట్టే రైతులకు ఆశాజనకంగా మారగా.. ఆరుతడి చేపట్టిన రైతుల పొలాలు పాడయ్యే పరిస్థితి తలెత్తింది. జిల్లాలో జూన్ మొదటి వారం నుంచి సాధారణ వర్షపాతం 485 మిల్లీమీటర్లు కాగా ఇప్పటి వరకు 648 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఐదు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగతా 15 మండలాల్లో అధిక వర్షపాతం నమోదయింది. 1,179 చెరువులన్నీ పూర్తిగా నిండాయి. ప్రస్తుతం 800 చెరువులు అలుగు పారుతుండగా మిగిలిన చెరువులు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరాయి. ఫీడర్ ఛానల్స్(పాటు కాల్వలు) సరిగాలేని, ఆక్రమణలకు గురైన చెరువులు మాత్రమే అలుగు పారడం లేదు. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులన్నీ వందశాతం నీటిమట్టానికి చేరుకున్నాయి. జుంటుపల్లి, కోట్‌పల్లి, లఖ్నాపూర్, సర్పన్‌పల్లి, శివసాగర్, కాకరవాగు తదితర ప్రాజెక్టులు పూర్తిగా నిండి అలుగు పారుతున్నాయి.

సాగు వివరాలు

డివిజన్	సాగు చేసిన ఎకరాలు
పరిగి	35,876
కొడంగల్	34,137
తాండూరు	21,964
వికారాబాద్	6,023

మోతాదు మించితే నష్టం



రైతులు అధిక మోతాదులో ఎరువులు వాడుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటికే 250 మెట్రిక్ టన్నుల యూరియా అధికంగా సప్‌లై చేశాం. మోతాదుకు మించి ఎరువులు వాడితే అనర్థాలే ఎక్కువ. యూరియా ఎక్కువగా వాడటంతో పైరు ఎక్కువగా పెరగటం, పచ్చగా మారటంతో పంటను ఆశించే పురుగులు, చీడపీడల శాతం పెరిగి పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాం.

– రాజారత్నం, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి



ధారూరు: కేరెళ్లిలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అభిమానులు

❖ జోహార్.. వైఎస్సార్

దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నివాళి అర్పించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలేసి జోహార్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పేదవాడి గుండెచప్పుడు తెలిసిన మహనీయుడు వైఎస్సార్ అని ఆయన సేవలను స్మరించుకున్నారు.

– వికారాబాద్ నెట్‌వర్క్

స్పోర్ట్స్ హబ్‌గా తెలంగాణ

- గ్రామీణ క్రీడాకారుల కోసం ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీ
- ఒలింపిక్స్‌లో స్వర్ణమే లక్ష్యంగా శిక్షణ
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

నందిగామ: తెలంగాణను గ్లోబల్ స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బీఏటీ) అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని కన్హా శాంతి వనంలోని గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్న ×యోనెక్స్ సన్‌రైజ్ 79వ సౌత్‌జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్– 2025 పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్యాడ్మింటన్ కేవలం ఒక ఆట మాత్రమే కాదని, జీవితానికి ఎన్నో పాఠాలు నేర్పే ఉత్తమ గురువు అని పేర్కొన్నారు. కోర్టులో పడిన ప్రతిసారీ లేచినిలబడే షటిల్ జీవితంలో మనకు ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి గొప్ప స్ఫూర్తినిస్తుందన్నారు. పుల్లెల గోపీచంద్, పీవీ సింధు, ప్రకాశ్ పదుకొనె, సైనా నెహ్వాల్, సాత్విక్, చిరాగ్, శ్రీకాంత్ వంటి దిగ్గజ క్రీడాకారులు బ్యాడ్మింటన్‌లో దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పారని కొనియాడారు. క్రీడాకారులు కేవలం పాయింట్లకోసమే కాకుండా దేశం కోసం, దేశ ప్రతిష్టకోసం ఆడాలని సూచించారు. క్రమశిక్షణే అసలైన కోచ్ అని, నిరంతర శ్రమనే అసలైన స్పాన్సర్‌అని, ఆత్మ విశ్వాసం, గెలవాలనే పట్టుదలే నిజమైన బలమని మార్గనిర్దేశం చేశారు. అత్యుత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు రాష్ట్రంలో ప్రపంచ స్థాయి సౌకర్యాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చిందని గుర్తుచేశారు. త్వరలోనే జరగబోయే ఒలింపిక్స్ క్రీడల్లో మన రాష్ట్రం నుంచి బంగారు పతకం సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్‌తో కలిసి బ్యాడ్మింటన్ ఆడారు. మూడు రోజుల పాటు ఈ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బీఏటీ ప్రధాన కార్యదర్శి, బ్యాడ్మింటన్ నేషనల్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, పలు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి నిరాధార ఆరోపణలు



అనంతగిరి: తబలా వాయిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్

అనంతగిరి: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం నిరాధారమైన ఆరోపణలు చేస్తోందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, కేసీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ కుట్రలకు నిరసనగా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, పార్టీ ముఖ్య నాయకులు నల్ల దుస్తులు ధరించి తబలా వాయిస్తూ పట్టణంలోని బీజేఆర్ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ అమరుల స్థూపం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కేసీఆర్‌పై కుట్రలు పన్నడం మాని రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రాన్ని సుభిక్షం చేసిన కేసీఆర్‌పై సీబీఐ కేసులు పెట్టడం సరికాదని మండిపడ్డారు. ఈ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గోపాల్, మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాన్‌రెడ్డి, అశోక్, మైనార్టీ అధ్యక్షుడు గయాజ్, సీనియర్ నాయకులు మాధవరెడ్డి, పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, షఫీ, దత్తు, పాండు, గిరీశ్ కొఠారి, గోపి తదితరులు పాల్గొన్నారు.



పరిగి: మహేశ్‌రెడ్డిని అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న వాహనాన్ని అడ్డుకుంటున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

కాంగ్రెస్ కుట్రలను బహిర్గతం చేస్తాం

పరిగి: బీఆర్‌ఎస్ నాయకుల అక్రమ అరెస్టులు ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శనమని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై, కేసీఆర్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారం తిప్పికొట్టాలని పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం నిరసన కార్యక్రమం చేపడుతుంటే పోలీసులు మాజీ ఎమ్మెల్యేను, బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. కొందరు పార్టీ నాయకులు పట్టణ కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై చేస్తున్న కుట్రను ప్రజాక్షేత్రంలో బహిర్గతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముకుంద అశోక్‌కుమార్, మీర్ మహ్మద్, ప్రవీణ్‌రెడ్డి, భాస్కర్, ఆంజనేయులు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏకదంతుడి పూజలో ఎస్పీ



గణనాథుడి పూజలో ఎస్పీ దంపతులు

అనంతగిరి: వికారాబాద్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడిని మంగళవారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఉదయం ఎస్పీ నారాయణరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టీఎస్ఎస్ కళాకారులకు సన్మానం



కళాకారులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా కళారూపాలు ఉండాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ సూచించారు. జిల్లాలో తెలంగాణ సాంస్కృతిక సారథి(టీఎస్ఎస్)లో పని చేస్తున్న గారెపాక భిక్షపతి, చింతల స్వప్న రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చాంబర్‌లో ఇరువురికి జిల్లా పౌర సంబంధాల అధికారి ఆకుల చెన్నమ్మ, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఎస్‌బీఐ సేవలు వినియోగించుకోవాలి



అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు

జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

నవాబుపేట: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను రైతులు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్కతలలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత రైతులకు, ప్రజలకు ఉపయోగపడేలా ఎస్‌బీఐ సేవలు అందిస్తుందన్నారు. రూ.436 వార్షిక ప్రీమియం చెల్లించి ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజనతో రూ.2లక్షల జీవిత బీమా రక్షణ పొందవచ్చన్నారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో రూ.20 ప్రీమియం చెల్లిస్తే రూ.2 లక్షల బీమా సదుపాయం అందుతుందని చెప్పారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా అతి తక్కువ పెట్టుబడితో వృద్ధాప్యంలో అత్యధిక ప్రయోజనాలు అందుతాయన్నారు. పంట రుణాలు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, ఈకేవైసీ సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఆర్‌బీఐ ఏజీఎం తాన్యశర్మ, డీజీఎంలు కుమార్ రోహిత్, సతీశ్ కుమార్, వికారాబాద్ రీజియన్ ఏజీఎం నితిన్ కుమార్, రమ్య, ఎల్‌డీఎం యాదగిరి, ఎంపీడీఓ అనురాధ, ఏజీఎం ఎస్ఎల్‌బీసీ శ్రీహరి, నవాబుపేట బ్రాంచ్ మేనేజర్ అరుణ్ కుమార్, సిబ్బంది, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగిరం చేయండి



దక్షిణ మధ్య రైల్వే అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రైల్వే అధికారులను కోరిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రైల్వే అండర్, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాల ప్రగతిపై చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రైల్వే అధికారులతో మంగళవారం చర్చించారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ, డీజీఎంలు ఉదయనాథ్, మల్లాది శ్రీనివాస్, సీపీఆర్ఓ శ్రీధర్‌లతో సమావేశమయ్యారు. శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించాలని, మున్సిపల్ పరిధిలోని ఫత్తేపూర్ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్‌యూబీ నిర్మించాలన్నారు. నావంద్గీ రైల్వే స్టేషన్‌లో హుబ్లీ ఎక్స్‌ప్రెస్ నిలపాలని కోరారు. వికారాబాద్–తాండూర్ మార్గంలో కోర్టు సమీపంలో రైల్వే ట్రాక్‌పై, రామయ్యగూడ వద్ద నిర్మించే ఆర్ఓబీల పనుల వేగిరానికి చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ రైల్వే స్టేషన్‌లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ప్యాసింజర్ రైళ్లను నిలపాలని కోరామన్నారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించారని చెప్పారు.

మెడి‘కల’ సాకారం

- తాండూరులో కొనసాగనున్న కొడంగల్ మెడికల్ కళాశాల
- ఈనెల రెండో వారంలో కౌన్సెలింగ్
- తొలి ఏడాది యాభై సీట్ల భర్తీకి ఐఎంఏ ఆమోదం



తాండూరులో మెడికల్ కాలేజీ కొనసాగనున్న భవనం

తాండూరు: కొడంగల్ మెడికల్ కళాశాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు లభించాయి. యాభై సీట్లతో కాలేజీ నిర్వహణకు మంగళవారం ఇండియన్ మెడికల్ కౌన్సిల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాండూరు పట్టణ శివారులోని మాతాశిశు ఆస్పత్రి పక్కన నిర్మించిన నర్సింగ్ కళాశాల భవనంలో కాలేజీ నిర్వహణకు తాత్కాలిక ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇందుకోసం పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేశారు. శాస్త్రసాంకేతిక, వైద్య యంత్రాలతో విద్యార్థుల బోధనకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించారు.

అన్ని వసతులతో భవనం

సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పట్టణ శివారులో కాలేజీ నిర్మాణ పనులను చేపట్టారు. అయితే మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలంటే 250 పడకల ప్రభుత్వ ఆస్పత్రి తప్పనిసరి. కొడంగల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాత్రమే ఉంది. దీనికి తోడు భవన నిర్మాణం పూర్తయ్యేందుకు మరో రెండేళ్ల సమయం పడుతుంది. ఈనేపథ్యంలో అప్పటివరకు తాండూరులో నిర్మించిన నర్సింగ్ కాలేజీలో మెడికల్ కళాశాల నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆరు నెలలుగా ఈ పనులను చేయిస్తోంది. ప్రస్తుతం అన్ని వసతులతో కూడిన కళాశాల భవనం అందుబాటులోకి వచ్చింది. మరోవైపు తాండూరులో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, మాతాశిశు ఆస్పత్రిలో దాదాపు 400 పడకలతో రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి.

తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి



తాండూరు: ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


మోమిన్‌పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్‌పై కుట్ర తగదు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్

పూడూరు: కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం పార్టీ పిలుపు మేరకు శాంతియుతంగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, మాజీ చైర్మన్ ముకుంద అశోక్, రాష్ట్ర నాయకులు కొప్పుల అనీల్‌రెడ్డితో పాటు నిరసన చేస్తున్న పలువురు నాయకులను పరిగిలో అరెస్టు చేసి చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శాంతి యుతంగా ధర్నా చేస్తుంటే అక్రమ అరెస్టులు ఏమిటని ప్రశ్నించారు. అరెస్టు విషయం తెలుసుకున్న ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మెతుకు ఆనంద్ మాట్లాడుతూ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక తప్పుల తడకగా ఉందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూడూరు మాజీ ఎంపీపీ మల్లేశం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజారుద్దీన్, సొసైటీ మాజీ చైర్మన్ పట్లోళ్ల నర్సింహారెడ్డి, నాయకులు వెంకటయ్య, ప్రవీణ్ కుమార్, సదానందం గౌడ్, జాహెద్, మైపాల్‌రెడ్డి, రహీస్‌ఖాన్, నర్సింలు, హరీశ్వర్‌రెడ్డి, సతీష్‌పంతులు, తాజొద్దీన్, శ్రీనివాస్‌గౌడ్, కోట్ల శంషు, అశోక్‌గౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపే: బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకట్

మోమిన్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్ ఆరోపించారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్టును సీబీఐకి అప్పగించడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కళ్లకు నల్ల బ్యాడ్జీలు కట్టుకొని నిరసన తెలిపారు. హరిశంకర్, అంజయ్య, మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, శ్రీరాంలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ కుట్రే..

నవాబుపేట: బీఆర్ఎస్‌ను అణగదొక్కాలనే కుట్రతోనే కాంగ్రెస్, బీజేపీలు కాళేశ్వరం ప్రాజెక్టును తెరమీదికి తెచ్చారని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. మండల కేంద్రంలో ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ధర్నా చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దయాకర్ రెడ్డి, విజయ్ కుమార్, శాంత్ కుమార్, పురుషోత్తం, మహేష్ రెడ్డి, అఫ్సర్ ఖాన్, సుధాకర్, దాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కక్ష్య సాధింపు రాజకీయాలు మానుకోని పరిపాలనపై దృష్టిపెట్టాలన్నారు. అనంతరం యూరియా కొరతపై తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌యాదవ్, మాజీ ఏఎంసీ చైర్మన్ మహేందర్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కాళేశ్వరం పేరిట కాంగ్రెస్ డ్రామాలు: శ్రీశైల్‌రెడ్డి

తాండూరు: కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు చేస్తోందని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి పంజుగుల శ్రీశైల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి నిరసనగా మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండలాల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, వీరేందర్, నర్సిరెడ్డి, నాయకులు నర్సింలు, శ్రీనివాసచారి, సందల్‌రాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శోభారాణి, శకుంతల న్నారు.

రోడ్డు బైఠాయింపు

ధారూరు: కాళ్లేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికపై సీబీఐ విచారణకు అప్పగించవద్దని, అరెస్టు చేసిన నాయకులను వదిలేయాలని మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ధారూరులో తాండూర్-హైదరాబాద్ రోడ్డుపై బైఠాయించారు. ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని పోలీసులు నచ్చజెప్పినా వినకపోవడంతో వారిని అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రాములు, చెన్నయ్య, ఎ. అంజయ్య, బాల్‌రాజ్‌నాయక్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


ధారూరు: ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు


పూడూరు: పోలీస్‌స్టేషన్లో మాజీ ఎమ్మెల్యేలు మహేష్‌రెడ్డి, ఆనంద్ తదితరులు


నవాబుపేట: బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

క్లుప్తంగా

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కిరణ్


రాఘవపూర్‌లో ఛాయ్ పే చర్చలో బీజేపీ నాయకులు

పరిగి: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి బూనేటి కిరణ్ సూచించారు. ప్రవాస్ యోజన-పల్లె పల్లెకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన రాఘవపూర్‌లో యువతతో చాయ్‌పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతీ గ్రామంలో కాషాయ జెండా ఎగుర వేసేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాగుతున్నాయని.. ఇది ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు నీరటి అనసూయ, నియోజకవర్గ కన్వీనర్ నర్సింలు, కేశవులు, రమేశ్, ఆంజనేయులు, మల్లేశ్ పాల్గొన్నారు.

వికారాబాద్‌లో వర్షం


రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

అనంతగిరి: వికారాబాద్‌లో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో వాతావరణమంతా చల్లబడింది. అరగంటకుపైగా కురిసిన వానతో రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది.


మా వారిని విడుదల చేయించండి


లేఖను ప్రదర్శిస్తున్న ఖైదీల కుటుంబ సభ్యులు

పంజగుట్ట: క్షణికావేశంలో నేరాలకు పాల్పడి ఏళ్ల తరబడి జీవిత ఖైదు అనుభవిస్తున్న తమ వారిని క్షమాభిక్ష ప్రసాదించి జైలు జీవితం నుంచి విముక్తి కలిగించాలని జీవిత ఖైదీల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖైదీల కుటుంబ సభ్యులు స్వప్న, బీచుపల్లి షరీఫ్, రాజేష్, అనీల్ కుమార్ మాట్లాడుతూ .. క్షణికావేశంలో చేసిన నేరాలతో జైలు జీవితాన్ని అనుభవిస్తున్న వారి పరిస్థితి ఒకలా ఉంటే వారిపై ఆధారపడ్డ వారి పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. భర్త దూరమై ఒకరు, తండ్రి దూరమైన పిల్లలు, సోదరుడు దూరమై, వృద్ధాప్యంలో ఉన్న వారు కొడుకులను దూరమై నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానవతాదృక్పథంతో స్పందించి గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న తమ వారికి క్షమాభిక్ష ప్రసాదించి సాధారణ జీవితాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


దస్తగిరి పటేల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్

పరిగి: కార్యకర్తలకు నిత్యం అండగా ఉంటానని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రానికి చెందిన దస్తగిరి పటేల్ అనారోగ్యంతో నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

పంటల నమోదు తప్పనిసరి

పెద్దేముల్ ఏఓ పవన్ ప్రీతం

తాండూరు రూరల్: రైతులు తాము సాగు చేసిన పంట వివరాలను నమోదు చేసుకోవాలని పెద్దేముల్ వ్యవసాయ శాఖ అధికారి పవన్ ప్రీతం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట నమోదు ఆధారంగానే పంటల కొనుగోలు, రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించేందుకు వీలుంటుందన్నారు. ఆయా గ్రామాల ఏఈఓల వద్ద పంట వివరాలు నమోదు చేయించాలని సూచించారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లను అందజేస్తోందని పెద్దేముల్ ఏఓ పవన్ ప్రీతం తెలిపారు. ఆసక్తి గల రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


నర్సిరెడ్డి (ఫైల్)

బొంరాస్‌పేట: రేగడిమైలారంలో జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొని చికిత్స పొందుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు చిట్టెపు నర్సిరెడ్డి మృతి చెందారు. గత నెల 26న ద్విచక్రవాహనంపై ప్రధాన కూడలినుంచి రోడ్డు దాటుతుండగా కొడంగల్ వైపు వేగంగా వెళ్తున్న వాహనం వెనకాల నుంచి బలంగా ఢీకొట్టింది. అప్పటి నుంచి చికిత్స పొందుతున్నారు. మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఆయా పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

బైక్ ఢీకొని యువకుడి మృతి

పోచారం: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు మృతి చెందిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చౌదరిగూడలోని సాయిబాబా నగర్‌కు చెందిన కొమ్ము వంశీ (21) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి అతను కొర్రెముల్ నుంచి చౌదరిగూడకు వస్తుండగా శ్రీసాయి ఎన్‌క్లేవ్ వద్ద ఎదురుగా వస్తున్న పల్సర్ బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు.

నానో యూరియాతో అధిక దిగుబడులు


రుద్రారంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ఆవరణలో అవగాహన కల్పిస్తున్న రాజరత్నం

డీఏఓ రాజరత్నం

కొడంగల్ రూరల్: నానో యూరియా వినియోగంతో అధిక దిగుబడులు సాధించొచ్చని జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం సూచించారు. మంగళవారం మండలంలోని రావులపల్లి, చంద్రకల్, కస్తూర్‌పల్లి చెక్‌పోస్టులను సందర్శించారు. యూరియా అక్రమ రవాణను అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. రావులపల్లిలోని రైతువేదికలో పంటల సస్యరక్షణ చర్యలపై, వ్యవసాయ శాఖ అమలుచేస్తున్న ప్రస్తుత పథకాలపై ఆయన అవగాహన కల్పించారు. రుద్రారంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని, అన్నారం, రావులపల్లి కొడంగల్ తదితర గ్రామ శివార్లలోని పత్తి, కంది, వివిధ రకాల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొడంగల్ పట్టణంలోని ఓం ట్రేడింగ్ కంపెనీ, నవతేజ ఫర్టిలైజర్ తదితర దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని దుకాణ యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శంకర్ రాథోడ్, ఏఓ జి.తులసి, ఏఈఓలు సుమ, దేవేందర్, రాజు రాథోడ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లోనే నిర్వహించాలి

కలెక్టరేట్ ఎదుట టీచర్లు, హెల్పర్స్ యూనియన్ ధర్నా


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్

అనంతగిరి: ప్రీ ప్రైమరీ పీఎం విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలని సీఐటీయూ జిల్లా ముఖ్య నాయకులు పేర్కొన్నారు. మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా బోధన బాధ్యతను అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకే అప్పగించాలన్నారు. విద్యా వాలంటీర్లకు ఇవ్వనున్న వేతనాన్నే తమకు అదనంగా చెల్లించాలన్నారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్, కార్యదర్శి రామకృష్ణ, చంద్రయ్య, సతీశ్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు భారతి, నర్సమ్మ, లక్ష్మి, నిర్మల, కవిత, యాదమ్మ, సత్యమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పాతపెన్షన్ విధానం అమలు చేయాలి

పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాజునాయక్

షాద్‌నగర్‌రూరల్: గత ఎన్నికల సమయంలో సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజునాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీపీఎస్ విధానంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు భవిష్యత్‌లో ఉద్యోగ భద్రత లేదని ఆరోపించారు. ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని అనేక సార్లు ఆందోళన కార్యక్రమాలను చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయబద్ధమైన సామాజిక భద్రతతో కూడిన పాతపెన్షన్ విధానాన్ని అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని కోరారు.

బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు

షాద్‌నగర్‌రూరల్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు అప్పగించడంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళనలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో నాయకులు పట్టణంలోని ముఖ్యకూడలిలో ధర్నా చేపట్టి రాస్తారోకో నిర్వహించారు. ఈ ధర్నాకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పోలీసులు బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తుంది. ధర్నా కార్యక్రమానికి ముందస్తుగా పోలీసుశాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడం, ట్రాఫిక్ జాంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించారనే నేపథ్యంలో కేసులు చేసినట్లు సమాచారం. ఈ ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేతో పాటు సుమారు 20 మందికిపైగా బీఆర్ఎస్ నేతలపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం.

అనాథ శరణాలయం పేరుతో టోకరా

బంజారాహిల్స్: తాను అనాథ శరణాలయం నుంచి ఫోన్ చేస్తున్నానని, శరణాలయానికి రూ.10,157 చెల్లిస్తే ప్రతినెలా మీ ఖాతాలో రూ.11,100 జమ అవుతుందని నమ్మించి ఓ వ్యక్తిని బురిడీ కొట్టించిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..బంజారాహిల్స్ ఉదయనగర్‌కు చెందిన గోపిరెడ్డి మహేశ్వర్ వ్యవసాయ శాఖలో పని చేస్తున్నాడు. గత నెల 31న రాత్రి అతడికి గుర్తుతెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. తాను అనాథ శరణాయం నుంచి ఫోన్ చేస్తున్నానని, రూ.10,157 చెల్లిస్తే ప్రతినెలా మీ ఖాతాలో రూ.11.100లు జమ అవుతాయని చెప్పాడు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, అధ్యాపకులు

తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు: విద్యార్థి దశలో ఇంటర్మీడియెట్ కీలకమని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్ లాంటి వాటితో జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఉన్నత చదువులకు రాచ మార్గం పడుతుందన్నారు. విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా ఏకాగ్రతతో చదువుకుని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం అధ్యాపకులతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని జలమండలి తట్టిఖానా వాటర్ రిజర్వాయర్ సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని రెండు గ్రూపులు ఆక్రమించేందుకు యత్నించడమేగాక ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తుడిచేసి కబ్జాదారులు తమ పేర్లను రాసుకున్నారు. దీనిపై సమాచారం అందడంతో పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. షేక్‌పేట మండలం, బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఎదురుగా ఐదెకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ స్థలం ఉంది. సదరు స్థలానికి రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఇందులో ఎకరన్నర స్థలాన్ని జలమండలికి కేటాయించారు. మిగతా మూడున్నర ఎకరాల స్థలం మండల రెవెన్యూ ఆధీనంలో ఉంది. రూ.400 కోట్ల విలువైన ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు పార్థసారధి, అతడి కుమారుడు విజయ్ భార్గవ్‌లు పలుమార్లు ప్రయత్నించారు. అంతటితో ఆగకుండా రౌడీలను నియమించుకుని సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి చుట్టూ బ్లూషీట్స్ కూడా నిర్మించుకున్నారు. రెవెన్యూ అధికారులు గతంలోనే మూడుసార్లు ఈ స్థలంలోకి వెళ్లి ఆక్రమణలను తొలగించి పార్థసారధి, విజయ్ భార్గవ్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినా వారు తమ వైఖరి మార్చుకోలేదు. ఇటీవల జలమండలి, రెవెన్యూ అధికారులు ఈ స్థలంపై జోక్యం చేసుకోవద్దంటూ స్టే కూడా తీసుకువచ్చారు. అయితే రెండు రోజుల క్రితం పార్థసారధి అనుచరులు ఒకవైపు, ఇదే స్థలాన్ని తనదిగా పేర్కొంటున్న విద్యాసాగర్ అనుచరులు మరోవైపు..ఈ స్థలంలోకి చొరబడ్డారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడమే కాకుండా స్థలంలో తమ పేర్లతో బోర్డులను కూడా ఏర్పాటుచేసుకున్నారు. దీంతో పోలీసులు ఇరువర్గాలకు చెందిన వారిని అదుపులోకి తీసుకున్నారు. విజయ్‌భార్గవ్ సోమవారం రాత్రి ఈ స్థలంలోకి చొరబడి వీఆర్ ఇన్‌ఫ్రా పేరుతో మరోసారి ఆక్రమణలకు యత్నించడంతో సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ డీసీపీ మంగళవారం ఘటనా స్థలాన్ని సందర్శించారు.

ఉపాధిలో అవకతవకలు

సామాజిక తనిఖీతో వెలుగులోకి


దౌల్తాబాద్‌లో సామాజిక తనిఖీలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

దౌల్తాబాద్: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. గత వారం రోజులుగా మండలంలో నిర్వహించిన సామాజిక తనిఖీల్లో ఈ విషయాలు వెలుగుచూశాయి. మంగళవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఇందుకు సంబంధించిన అక్రమాలను బయటపెట్టారు. 2024– 25 సంవత్సరానికిగాను మండలంలో సుమారు రూ.6 కోట్లతో ఉపాధి పనులు చేపట్టారు. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్, టీఏల చేతివాటం బయటపడింది. పశువుల కొట్టాల నిర్మాణం, మస్టర్ల నిర్వహణ, రికార్డుల అస్తవ్యస్తంగా ఉండడం, చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడం వంటి అక్రమాలు జరిగినట్లు తేలింది. ఇందుకు కారణమైన వారినుంచి రూ.40 వేలు జరిమానా వేసి, రూ.1.20 లక్షలు రికవరీకి ఆదేశించినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఏపీడీ సరళ, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ అంజిలయ్య ఉన్నారు.

మట్టి తొలగించాలని ఫిర్యాదు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వేములనర్వ గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులో ఉన్న శ్మశానవాటిక వెళ్లకుండా కొందరు రియల్టర్లు మట్టిని అడ్డంగా వేసినట్టు గ్రామానికి చెందిన పలువురు మంగళవారం తహసీల్దార్ అజాంఅలీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డిలకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. శ్మశానవాటిక పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులతో పాటుగా రియల్టర్లు మట్టిని పోశారన్నారు. దీంతో వర్షం నీరు బయటికి వెళ్లడం లేదన్నారు. గ్రామంలో ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలకు వెళ్లడానికి వీలుకావడం లేదన్నారు. అధికారులు స్పందించి శ్మశానవాటిక నుంచి నీరు బయటికి వెళ్లే విధంగా మట్టిని తొలగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మల్లేష్, శ్రీను, దాసునాయక్, రాఘవేందర్, శ్రీకాంత్, శ్రీశైలం, ఎల్లయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.